క్లుప్తంగా

పార్టీ బలోపేతానికి కృషి చేయండి



పార్టీ అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన కార్తీక్‌రెడ్డి

కార్వేటినగరం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కలసికట్టుగా పనిచేయాలని ఆ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తనకు దిశా నిర్దేశం చేశారని జిల్లా సోషల్ మీడియా ప్రధాన కార్యదర్శి, వైస్ ఎంపీపీ కార్తీక్‌రెడ్డి తెలిపారు. ఆయన బుధవారం అధినేతను విజయవాడలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసినట్లు చెప్పారు. మండల సోషల్ మీడియా అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి మునిరెడ్డి, పార్టీ నాయకుడు అఖిలాష్‌రెడ్డి కూడా కలిశారు.

పాడి పశువులకు వైద్య పరీక్షలు

నింద్ర: పాడి రైతులు తమ పశువులకు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించి రోగాల నుంచి రక్షించుకోవాలని ఆరూరు పశువైద్య ఉప కేంద్రం వైద్యాధికారి ప్రభాకర్ వర్మ తెలిపారు. ఆయన బుధవారం ఓబుళరాజుకండ్రిగలో పశువైద్య శిబిరం నిర్వహించారు. పశువులకు టీకాలు వేశారు. నట్టల నివారణ మందు తాగించారు. ఆయన మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పశువులకు అంటురోగాలు సోకే అవకాశం ఉందన్నారు. ముందస్తుగా టీకాలు వేయించడం వల్ల వాటిని కాపాడుకోవచ్చని చెప్పారు.

ప్లాట్ల రెగ్యులరైజేషన్‌కు మరో అవకాశం



మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి

నగరి: ప్రభుత్వ లేఅవుట్ రెగ్యులరైజేషన్, పీనలైజేషన్‌ను అనుసరించి ప్లాట్ల రెగ్యులరైజేషన్‌కు మరోసారి అవకాశం కల్పిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. కొత్తగా సవరించిన జీవో నంబరు 134 ప్రకారం అనధికార లే అవుట్లలో కొనుగోలు చేసిన ప్లాట్లను రెగ్యులరైజ్ చేసుకోవడానికి అవకాశం కల్పించిందని తెలిపారు. 2025 జూన్ 30లోపు అనధికార లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు అక్టోబర్ 24లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇందుకోసం పటిష్టమైన ఆధారాలు సమర్పించాల్సి ఉంటుందన్నారు. రెగ్యులరైజేషన్‌కు పురపాలక సంఘం వెబ్‌సైట్‌గానీ, టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులను గానీ సంప్రదించాలన్నారు.

ఇన్‌చార్జ్ సర్వేయర్‌గా గణేష్



గంగాధర నెల్లూరు: గంగాధర నెల్లూరు మండల ఇన్‌చార్జ్ సర్వేయర్‌గా గణేష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సర్వేయర్‌గా పని చేస్తున్న సునీతను ఏడీ కార్యాలయానికి అటాచ్ చేశారు. పాలసముద్రం నుంచి గణేష్ ఇక్కడికి బదిలీపై వచ్చారు.

రోగులతో స్నేహ భావంతో మసలుకోండి



పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సుధారాణి

పాలసముద్రం: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు చికిత్స నిమిత్తం వచ్చే రోగులతో స్నేహపూర్వకంగా మసలుకుని వారికి అవసరమైన వైద్య పరీక్షలు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డిటి సుధారాణి ఆదేశించారు. బుధవారం ఆమె స్థానిక పీహెచ్‌సీని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడారు. టీకాలు వేసిన పిల్లలు, గర్భిణుల వివరాలను యూవిన్ పోర్టల్, ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు మోహన్‌క్రిష్ణ, జయకుమార్, పీహెచ్‌ఓ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం



కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థాన నిత్యన్నదాన ట్రస్టుకు బుధవారం పూతలపట్టు మండలం బందార్లపల్లెకు చెందిన కొంగర నవీన్ లక్ష రూపాయల విరాళాన్ని అందజేశారు. అనంతరం ఆలయ అధికారులు ఆయనకు స్వామి దర్శనం కల్పించారు.

ధర్మరాజుల బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

- భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పాలాభిషేకం
- పట్టణంలో ఊరేగిన గణనాథుడు



విశేషాలంకరణలో వినాయకుడు

పుత్తూరు: పట్టణంలోని ద్రౌపదీదేవీ సమేత శ్రీధర్మరాజులస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలకు బుధవారం అంకురార్పణ నిర్వహించారు. ఉదయం 6 గంటలకు అర్చకులు విఘ్నేశ్వర పూజ, వాస్తు శాంతి, కలశ స్థాపన చేశారు. అనంతరం శాస్త్రోక్తంగా అంకురార్పణ చేపట్టారు. 9 గంటలకు పుత్తూరు పట్టణానికి చెందిన వన్నెరెడ్డి సమన్వయ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల కలశాలు, పట్టువస్త్రాలతో స్థానిక ఆంజనేయ స్వామి ఆలయం వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి వచ్చారు.





పాల కలిశాలు, పట్టువస్త్రాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు, అమ్మవారికి స్వహస్తాలతో పాలాభిషేకం చేస్తున్న మహిళలు

అక్కడ ద్రౌపదీదేవికి పాలాభిషేకం చేశారు. అనంతరం అర్చకులు ద్రౌపదీదేవీ సమేత ధర్మరాజులస్వామి వార్లను పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. మధ్యాహ్నం 12 గంటలకు ఆలయ ఆవరణలో ముద్దుకృష్ణారెడ్డి, అమ్ము దంపతుల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు భాగవతారిణి స్వర్ణలత హరికథా గానం చేశారు. రాత్రి 7 గంటలకు విఘ్నేశ్వరస్వామిని వివిధ పుష్పాలతో విశేషంగా అలంకరించి, మంగళవాయిద్యాలు, బాణసంచా పేలుళ్ల మధ్య పట్టణంలో ఊరేగించారు. భక్తులు వినాయకస్వామికి నారికేళ్ల కర్పూర నీరాజనాలు సమర్పించారు. అనంతరం ఆలయం వద్ద భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

నేడు ద్రౌపదీదేవి పుట్టింటికి పయనం

గురువారం ద్రౌపదీదేవి జన్మస్థలమైన చౌటూరు గ్రామానికి వెళ్లి, పరిసర గ్రామాల భక్తుల నుంచి పసుపు కుంకుమ, చీర–సారె తీసుకొని ఊరేగింపుగా ఆలయానికి తిరిగి వస్తారు. సాయంత్రం కామధేనువు వాహనంపై శ్రీరుక్మిణీ, సత్యభామ సమేత శ్రీకృష్ణస్వామి ఊరేగుతూ భక్తులను అనుగ్రహిస్తారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

నగరి: స్థానిక ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార కేంద్రంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సీఈవో తులసిపిళ్లై తెలిపారు. ఇందులో తిరుపతికి చెందిన ఏవీఐఎస్ ఆస్పత్రి వైద్యులు పాల్గొని వెరికోస్ వెయిన్స్‌తో బాధపడుతున్న వారికి చికిత్స చేస్తారని తెలిపారు. కాళ్లలో మంట, దురద, రంగు మారడం, నరాలు ఉబ్బడం, పుండు ఏర్పడం తదితర లక్షణాలు ఉన్నవారు వైద్య శిబిరానికి వచ్చి చికిత్సలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

క్షయ రహిత సమాజమే లక్ష్యం

నింద్ర: క్షయ రహిత సమాజమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని వైద్యాధికారి సుమలత తెలిపారు. ఆమె బుధువారం వైద్యశాలలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వారానికి మించి దగ్గు వుంటే వెంటనే ఆస్పత్రికి వెళ్లి గళ్ల పరీక్ష చేసుకోవాలన్నారు. క్షయవ్యాధిని ముందుగా గుర్తిస్తే నయం చేయవచ్చని చెప్పారు. ప్రభుత్వం క్షయ వ్యాధిగ్రస్తులకు ఉచితంగా మందులు పంపిణీ చేస్తోందని తెలిపారు. ఈ విషయాన్ని గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు ఏఎన్‌ఎంలు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ వినీషా, హెల్త్ ఎడ్యుకేటర్ గోపి, సీహెచ్‌వో శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

దళితుడని చిన్నచూపా..?



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ హరి



సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు

- ధర్మరాజుల బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలో చైర్మన్ పేరు లేకపోవడంపై వివాదం
- టీడీపీ ఫ్లోర్ లీడర్‌ను నిలదీసిన వైస్ చైర్మన్ జయప్రకాష్
- పొరబాటు జరిగిందని అంగీకరించిన టీడీపీ ఫ్లోర్ లీడర్
- వాడీవేడిగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

పుత్తూరు: పట్టణంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ద్రౌపదీదేవి సమేత ధర్మరాజులస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలో పట్టణ ప్రథమ పౌరుడైన మున్సిపల్ చైర్మన్ ఆనంగి హరి పేరు లేకపోవడాన్ని కౌన్సిల్ సభ్యులు తీవ్రంగా తప్పుబట్టారు. దళితుడనే ఆయన పేరు లేకుండా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం చైర్మన్ హరి అధ్యక్షతన సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. టీడీపీ ఫ్లోర్ లీడర్ జీవరత్నంనాయుడు మాట్లాడుతూ ఏటా ద్రౌపదీదేవి బ్రహ్మోత్సవాల్లో మున్సిపాలిటీ తరపున సారె ఇవ్వడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు. ఈ సమావేశపు అజెండాలో ఆ విషయాన్ని ప్రస్తావించకపోవడం తగదన్నారు. దీనిపై మున్సిపల్ వైస్ చైర్మన్ జయప్రకాష్ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలో మున్సిపల్ చైర్మన్ హరి పేరును ఎందుకు ముద్రించలేదని, అతను దళితుడని పక్కన పెట్టారా? అని ప్రశ్నించారు. మున్సిపాలిటీ తరపున సారెను మున్సిపల్ చైర్మన్ చేతుల మీదుగా ఇవ్వాల్సి ఉండగా ఆహ్వాన పత్రికలో ఆయన పేరే ప్రస్తావించకపోతే ఎలా అంటూ నిలదీశారు. బ్రహ్మోత్సవాల నిర్వహణలో మున్సిపాలిటీ నిధులు ఖర్చు చేయడంతో పాటు సిబ్బంది సేవలు కూడా ఉంటాయని పేర్కొన్నారు. మున్సిపల్ చైర్మన్ పేరు లేకపోవడం ఎమ్మెల్యేకి తెలిసి జరిగిందా? తెలియక జరిగిందా? అన్న విషయాన్ని చెప్పాలని డిమాండ్ చేశారు. దీనిపై టీడీపీ ఫ్లోర్ లీడర్ జీవరత్నంనాయుడు సమాధానం ఇస్తూ పొరపాటు జరిగిందని, దాన్ని సరిదిద్దుతామని చెప్పారు. అవసరమైతే చైర్మన్ పేరుతో పాటు మళ్లీ ఆహ్వాన పత్రికను ముద్రిస్తామని స్పష్టం చేశారు. అమ్మవారికి మున్సిపాలిటీ తరపున ఇచ్చే సారె ఆనవాయితీని కొనసాగిస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు.

ప్రాధాన్యతాపరంగా అభివృద్ధి పనులు

చైర్మన్ హరి మాట్లాడుతూ ప్రాధాన్యతాపరంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. 2023–24 ఏడాదికి చెందిన 15వ ఆర్థిక సంఘ రెండవ విడత నిధులు రూ.1,16,84,000, అన్‌టైడ్ గ్రాంటు కింద రూ.77,89,000 మంజూరైనట్లు తెలిపారు. అమృత్–2.0 కింద నీటి సరఫరా పథకం కోసం పబ్లిక్ హెల్త్ అండ్ మున్సిపల్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ (పీహెచ్‌ఎంఈడీ) ద్వారా రూ.4.38 కోట్లకు గాను అర్బన్ మున్సిపాలిటీ వాటాగా రూ.58,88,896 ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. అంతకు ముందు పలువురు కౌన్సిలర్లు మాట్లాడుతూ తమ వార్డుల్లో అభివృద్ధి పనులు జరగడం లేదని, ప్రతి సమావేశంలో అడుగుతున్నా ఫలితం లేదని వాపోయారు. దీనిపై కమిషనర్ మంజునాథ్‌గౌడ్ సమాధానం ఇస్తూ అన్ని వార్డుల్లోనూ ప్రాధాన్యతాపరంగా పనులు చేపడుతున్నట్లు తెలిపారు. సమావేశంలో వైస్ చైర్మన్ శంకర్, డిప్యూటీ తహసీల్దార్ అశోక్‌రెడ్డి, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేతలకు భరోసా



సుభాష్‌ను పరామర్శిస్తున్న మాజీ మంత్రి ఆర్కేరోజా

పుత్తూరు: పుత్తూరు మున్సిపాలిటీ 26వ వార్డుకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు గోపి కుమారుడు సుభాష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయాల పాలయ్యాడు. ప్రస్తుతం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. అతన్ని బుధవారం మాజీ మంత్రి ఆర్కేరోజా పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిపై ఆరాతీశారు. అలాగే పుత్తూరు మున్సిపాలిటీ 5వ వార్డుకు చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు ఎలుమలైరెడ్డి సతీమణి అనారోగ్యం బారిన పడి చికిత్స తీసుకుని ప్రస్తుతం ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆమెను రోజా పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ హరి, వైస్ చైర్మన్లు శంకర్, జయప్రకాష్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా గంగ జాతర



గంగమ్మను దర్శించుకుంటున్న ఆర్కేరోజా

పుత్తూరు: పుత్తూరు రూరల్ మండలం కేవీఆర్ పురంలో బుధవారం గంగ జాతరను ఘనంగా జరుపుకున్నారు. గంగమ్మకు గ్రామ ప్రజలు కుంభాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారిని బుధవారం సాయంత్రం మేళతాళాల మధ్య ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. మాజీ మంత్రి ఆర్కేరోజా అమ్మవారిని దర్శించుకున్నారు. అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆమెకు గ్రామస్తులు బైక్ ర్యాలీతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ మునివేలు, వైస్ ఎంపీపీలు మునస్వామి రెడ్డి, విమల, వైఎస్సార్ సీపీ రూరల్ మండల అధ్యక్షులు అన్నాలోకనాథం, మున్సిపల్ చైర్మన్ హరి, వైస్ చైర్మన్లు శంకర్, జయప్రకాష్, భాస్కర్ యాదవ్, రవీంద్ర, కేటీ ప్రసాద్, లోకనాథం, ప్రతాప్, గోవిందస్వామిరెడ్డి, రామ్‌బత్తయ్య, కిషోర్, గిరిజాప్రసాద్, షణ్ముగం, వెంకటేశ్, ఉదయకుమార్, లక్ష్మణమూర్తి, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

నివాళి



కోదండరెడ్డికి నివాళులర్పిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, నేతలు

పెనుమూరు(కార్వేటినగరం):మండలంలోని సాతంబాకం పంచాయతీ మిట్టూరుకు చెందిన పందికుంట కోదండరెడ్డి(72) గత వారం అనారోగ్యంతో మృతి చెందారు. బుధవారం నిర్వహించిన కర్మక్రియలకు మాజీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి మహాసముద్రం దయాసాగర్‌రెడ్డి హాజరై ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కోదండరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దొరస్వామి యాదవ్, జిల్లా మహిళా కార్యదర్శి యశోదారెడ్డి, పార్టీ మండల కన్వీనర్ విజయకుమార్‌రెడ్డి, మాజీ కన్వీనర్ సురేష్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు దూది మోహన్, గోవిందరెడ్డి, చక్రవర్తినాయుడు తదితరులు పాల్గొన్నారు.



వెదురుకుప్పం: నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి నారాయణస్వామి, నేతలు

పచ్చికాపల్లంలో మాజీ సర్పంచ్‌కు..

వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లం పంచాయతీ మాజీ సర్పంచ్, స్థానిక ద్రౌపదీ ధర్మరాజుల ఆలయ ధర్మకర్త నెలవాయి మునిరత్నంరెడ్డికి మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి నివాళులు అర్పించారు. బుధవారం కర్మక్రియలకు ఆయన హాజరై మునిరత్నంరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పద్మనాభరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బండి గోవర్ధన్‌రెడ్డి, ప్రచార కమిటీ జిల్లా అధ్యక్షుడు బట్టే సుబ్రమణ్యం, ఎంపీటీసీ సభ్యులు తోకలమురళీరెడ్డి, రాధిక, యువత రాష్ట్ర కార్యదర్శి ధనంజయరెడ్డి, వైద్య విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు కోలార్ ప్రకాష్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఎస్సీ బాలుర హాస్టల్ తనిఖీ



ఎస్సీ వసతి గృహాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో

కార్వేటినగరం: విద్యార్థులకు మెనూతో కూడిన నాణ్యమైన భోజనం పెట్టాలని ఎంపీడీఓ చంద్రమౌళి ఆదేశించారు. బుధవారం స్థానిక ఎస్సీ బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేశారు. పిల్లలకు సాయంత్రం ట్యూటర్లతో ట్యూషన్ చెప్పించాలని, మరుగుదొడ్లు, స్నానపు గదులకు త్వరితగతిన మరమ్మతులు పూర్తి చేసి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని వార్డెన్‌ను ఆదేశించారు.

వికలాంగుడికి ఆర్థిక సాయం



జగదీష్‌కు నగదు అందజేస్తున్న చిత్తూరు మున్సిపల్ మాజీ కౌన్సిలర్ పార్థసారథినాయుడు

పెనుమూరు(కార్వేటినగరం): రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లూ కోల్పోయిన ఓ యువకుడికి చిత్తూరు మాజీ కౌన్సిలర్ పార్థసారథినాయుడు ఆర్థిక సాయం చేశారు. మండలంలోని కేసీపల్లె పంచాయతీ గొల్లపల్లె దళితవాడకు చెందిన మునిరత్నం కుమారుడు జగదీష్ గతంలో రోడ్డు ప్రమాదానికి గురై రెండు కాళ్లను కోల్పోయాడు. అసలే పేద కుటుంబం కావడం, కుమారుడు వికలాంగుడు కావడంతో ఇద్దరు కుమార్తెలతో కలిసి మునిరత్నం వ్యవసాయ కూలి పనులకు వెళ్తూ బతుకు బండిని కష్టంగా లాగిస్తున్నారు. ఇది తెలుసుకున్న చిత్తూరు మాజీ కౌన్సిలర్ గ్రామానికి వెళ్లి జగదీష్ తల్లిదండ్రులకురూ.10 వేలతోపాటు కొత్త దుస్తులను అందజేశారు. జగదీష్‌కు ప్రభుత్వం వికలాంగ పింఛన్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



మాట్లాడుతున్న మున్సిపల్ కమీషనర్



జీడీ నెల్లూరులో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ గురుప్రకాష్, వైద్య సిబ్బంది

నగరి: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా వుండాలని మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి తెలిపారు. ఆయన బుధవారం పారిశుద్ధ్య, పర్యావరణ కార్యదర్శులు, ఏఎన్‌ఎంలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ అంటు వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పరిసరాల శుభ్రతతోనే రోగాలను దూరం చేయవచ్చని, దోమకాటు నుంచి రక్షించుకునేందుకు దోమ తెరలు వాడాలని ప్రజలకు తెలియజేయాలన్నారు. సత్రవాడ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎయిల్ అరసన్ మాట్లాడుతూ శుక్రవారాన్ని డ్రైడేగా పాటించాలన్నారు. తద్వారా దోమలు పెరగకుండా కట్టడి చేయవచ్చన్నారు. పుదుపేట అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బిందు మాట్లాడుతూ పరిసర ప్రాంతాలు, ఖాళీ స్థలాల్లో నీరు నిలవకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ పురుషోత్తం పాల్గొన్నారు.

గంగాధర నెల్లూరులో..

గంగాధర నెల్లూరు: జ్వరం, దగ్గుతో ఎక్కువ రోజులు బాధపడుతున్న పక్షంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య పరీక్షలు చేసుకోవాలని డాక్టర్ గురు ప్రకాష్ అన్నారు. స్థానిక ఎగవూరు లో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పౌరసరఫరాల శాఖలో హమాలీలుగా పని చేస్తున్న వారికి వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, ఇళ్ల వద్ద మురుగు నీరు లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ భగవతి, సంపత్, ఏఎన్‌ఎం మాధవి, మమత, వైద్య సిబ్బంది కదిరానన్, సుధాకర్, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సమాచారం విలువైన శక్తితో సమానం



విజేతకు బహుమతి అందిస్తున్న డీఎస్పీ

నగరి: సమాచారం విలువైన శక్తితో సమానమని డీఎస్పీ సయ్యద్ మహ్మద్ అజీజ్ తెలిపారు. సమాచార హక్కు చట్టం అమలులోకి వచ్చి 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం రాజనీతి శాస్త్ర విభాగం, ఆర్‌టీఐ విభాగం సంయుక్తంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ సమాచారాన్ని తగిన విధంగా ఉపయోగించుకోవడం ద్వారా హక్కులను కాపాడుకోవచ్చునన్నారు. అవినీతిని వెలికితీయవచ్చని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవచ్చని చెప్పారు. సమాచారం పొందడానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని, 30 రోజుల లోపు సమాచారం ఇవ్వాల్సి వుంటుందని తెలిపారు. లేకుంటే అదే కార్యాలయ అధికారిని గానీ, రాష్ట్ర, జాతీయ సమాచార కమిషన్లను గానీ సంప్రదించవచ్చన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టాన్ని కేంద్రం 2005 జూన్‌లో తీసువచ్చిందని, అక్టోబర్ 12 నుంచి అమలులోకి వచ్చిందని తెలిపారు. ప్రతి పౌరుడు తనకు కావలసిన సమాచారాన్ని ప్రభుత్వం నుంచి పొందే హక్కు లభించిందన్నారు. వైస్ ప్రిన్సిపాల్ భాస్కరరాజు మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం వల్ల ప్రభుత్వంలో పారదర్శకత, జవాబుదారీ తనం, ప్రజా సాధికారత పెరిగిందన్నారు. నిబంధనలకు లోబడి సమాచారాన్ని అందించాలని, లేకుంటే రూ.25 వేల జరిమానా చెల్లించవలసి ఉంటుందన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్విజ్, వ్యాసరచన, వక్తృత్వ, డిబేట్ పోటీల్లో విజేతలుగా నిలిచిన సౌమ్య, నాగలింగం, మోహన్, భవ్య, మోనిష, గాయత్రి, పవిత్రకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో క్యూ కోఆర్డినేటర్ ఇందిరా ప్రియదర్శిని, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామ్స్ వేణుగోపాల్, అకడమిక్ కోఆర్డినేటర్ మహేశ్వరి, ప్లేస్ మెంట్ విభాగం కోఆర్డినేటర్ పంకజ, ఎన్‌సీసీ లెఫ్టినెంట్ భాస్కర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి గోపి, అధ్యాపకులు రామాంజులు, చిన్నపాపమ్మ, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

పెరటి కోళ్ల పంపిణీ



పెరటి కోళ్లు పంపిణీ చేస్తున్న ఏపీఎం, సీసీలు

పాలసముద్రం: డ్వాక్రా మహిళలు పెరటి కోళ్ల పెంపకంలో ఎక్కువ ఆదాయం పొందవచ్చని ఐకేపీ ఏపీఎం కల్పలతా రెడ్డి అన్నారు. బుధవారం డ్వాక్రా మహిళలకు 50 యూనిట్ల పెరటి కోళ్లు పంపిణీ చేసి ఆమె మాట్లాడారు. ఒక యూనిట్ కింద 11 కోళ్లను 3100 రూపాయలకు ఇస్తున్నట్లు చెప్పారు. వాటిని పెంచితే ఒక కోడి సుమారు 3 కిలోలు బరువు తూగుతుందని, కిలో రూ.450 చొప్పున విక్రయించవచ్చన్నారు. కార్యక్రమంలో సీసీ చిరంజీవి, సంఘమిత్ర మంజుల, మురగయ్య, దేవకి పాల్గొన్నారు.

పశుసంతతిని పెంపొందించండి



పాడి రైతులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా పశుసంవర్థకశాఖ డీడీ వాసు

శ్రీరంగరాజపురం: పాడి రైతులు పశు సంతతిని పెంపొందించుకోవాలని జిల్లా పశుసంవర్థకశాఖ డీడీ వాసు కోరారు. బుధవారం మండలంలోని కటికపల్లెలో పశు సంతతి పరిశీలన పథకంపై పాడి రైతులతో ఆయన సమీక్షించారు. సంకర జాతి జెర్సీ ఆవులతో పాలు దిగుబడి పెరుగుతుందన్నారు. జన్యు సామర్థ్యం కలిగిన కోడెదూడలు ప్రతికూల వాతావరణాన్ని తట్టుకుంటున్నాయన్నారు. సంకరజాతి జెర్సీ ఆవుల్లో జన్యుపరంగా పాడి సంపద శక్తిని, పెంపొందించి వీర్య కేంద్రాలలో ఉన్న విత్తనపు కోడెలను పరిశీలించి, వాటి ద్వారా అత్యధిక జన్యు సామర్థ్యం కలిగిన కోడెలను ఉత్పత్తి చేస్తున్నట్లు పేర్కొన్నారు. వీటితో కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారులు శ్రీవిద్య, ఆదిత్యనాథ్‌రెడ్డి, రామయోగనందరెడ్డి, మౌనిక, సుధాకర్, నిరంజన్‌కుమార్, సర్పంచ్ మార్కొండయ్య తదితరులు పాల్గొన్నారు.